క్లుప్తంగా

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి తహసీల్దార్‌గా సోమవారం కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తులసీరాం టేక్మా ల్ మండలానికి బదిలీకావడం ఆయన స్థానంలో టేక్మాల్ నుంచి బదిలీపై కృష్ణ వచ్చారు. మండలంలో ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా నూతన కృష్ణ తెలిపారు.

ఆలయానికి దారి ఏర్పాటు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి బిజ్జిపూర్‌లోని దుర్గమ్మ ఆలయానికి వెళ్లేందుకు ఎట్టకేలకు దారి ఏర్పాటు అయ్యింది. కొన్ని రోజుల నుంచి దుర్గమ్మ ఆలయం, వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో పలువురు పట్టాదారులను గ్రామస్తులు దారి కోసం విజ్ఞప్తి చేశారు. గతంలో ఆలయానికి 15 ఫీట్ల దారి పట్టాదారుడు జాంగిర్ ఇచ్చారు. సోమవారం స్థానిక ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి సమక్షంలో మరో పట్టాదారు సమీరా 15 ఫీట్లు దారి కోసం దానం ఇచ్చారు. మొత్తం 30 ఫీట్లతో ప్రధాన రోడ్డు నుంచి ఆలయం, వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు అవకాశం ఏర్పడింది. ఈ సందర్భంగా గ్రామస్తులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



నర్సాపూర్ కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నర్సాపూర్: న్యాయవాది సంతోష్‌పై దాడి చేసిన కూకట్‌పల్లి ఎస్‌ఐ జమాల్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి కోర్టు బయట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్‌గౌడ్, ప్రభు, సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రకాష్, స్వరూపరాణి, రాజునాయక్, నాగరాజు, మధుశ్రీ, రవినాయక్, ఆరీఫ్, సాయిరాం పాల్గొన్నారు.

ఇనుప స్తంభాలకు దూరంగా ఉండాలి

రేగోడ్(మెదక్): ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇనుప విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ పోచయ్య ప్రజలకు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వర్షం పడే సమయంలో బైక్ పై వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులు చెట్లకింద ఉండకూడదన్నారు. గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. చార్జింగ్ పెట్టి సెల్‌ఫోన్ మాట్లాడకూడదన్నారు.

దంచికొట్టిన వాన



గొట్టిముక్కుల శివారులో రోడ్డుపై కూలిన చెట్టు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం అరగంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ చిత్తడిగా మారాయి. ప్రస్తుతం కురిసిన వర్షానికి ఆరుతడి పంటలతో పాటు వరి చేనుకు మేలు చేస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండలం నుంచి రేగోడ్ వెళ్లే దారిలో గొట్టిముక్కుల శివారు వద్ద రహదారిపై చెట్టు కొమ్మ కూలిపడింది.

నేడు రామాయంపేటకు ఎంపీ రాక

రామాయంపేట(మెదక్): ఎంపీ రఘునందన్ రావు మంగళవారం రామాయంపేట రానున్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత మొదటిసారిగా రామాయంపేటకు వస్తున్న ఎంపీకి ఘన స్వాగతం పలకడానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. కృతజ్ఞత సభ పేరిట నిర్వహించే ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నారు.

అసలైన రక్షకుడు అంబేడ్కర్

సిద్దిపేటకమాన్: మహిళలకు అసలైన రక్షకుడు అంబేడ్కర్ అని ధర్మ సమాజ్ పార్టీ మహిళ నాయకులు అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వారు రాఖీకట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనామార్గంలో మహిళలంతా మరింత శక్తివంతంగా మారాలన్నారు.

రాఖీ పౌర్ణమి వేడుకలు

జిల్లావ్యాప్తంగా రాఖీ పండుగను అన్నచెల్లెళ్లు, అక్కతమ్ముళ్లు ఘనంగా జరుపుకొన్నారు. సోదరులకు సోదరీమణులు రాఖీ కట్టి సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. రక్తసంబంధీకులంతా ఒక చోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. ఆయా ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు ఇంటింటా స్వీట్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో పూజలు చేశారు.

– నెట్‌వర్క్



కాడిపల్లి: రాజిపేటలో పెంపుడు కుక్కకు రాఖీ కడుతున్న చిన్నారి



అల్లాదుర్గం మండలం ముప్పారం అంగన్‌వాడీ కేంద్రంలో రాఖీ వేడుకలు జరుపుకొంటున్న చిన్నారులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): జగ్గంపేటలో అన్నయ్యలకు రాఖీలు కడుతున్న చిట్టి చెల్లెలు



పాపన్నపేట: పాపన్నపేటలో రాఖీలు కడుతున్న ఆడ పడుచులు



శివ్వంపేటలో రక్షాబంధన్ వేడుకలు



రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న పుష్పలత



చేగుంట: ఎన్‌జీఓ కాలనీలో రక్షాబంధన్ వేడుకలు



కొల్చారం: సోదరులకు రాఖీలు కడుతున్న దృశ్యం

మార్కెట్ పీఠం ఎవరికో..?

తూప్రాన్ మార్కెట్ చైర్మన్ గిరిపై ఉత్కంఠ

తూప్రాన్: తూప్రాన్ మార్కెట్ పీఠంపై ఉత్కంఠ నెలకొంది. పీఠం దక్కేది ఎవరికనేది ప్రశ్నార్థకంగా మారింది. ఓ వైపు చైర్మన్ గిరిపై కన్నేసిన ఆశావహులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తుండగా.. కాంగ్రెస్ అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనేది తేలాల్సి ఉంది. రైతులకు మేలు చేకూర్చేందుకు గత ప్రభుత్వ హయాంలో 2017, జూలై 21 తూప్రాన్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు అయింది. యార్డు నిర్వహణకు ఓ కార్యాలయం ఏర్పాటు చేశారు. అయితే ఏడేళ్లు గడిచినా సిబ్బందిని మాత్రం నియమించలేదు. క్రయవిక్రయాలు ప్రారంభమే కాలేదు. మార్కెట్ చైర్మన్ గిరి ఒక ప్రచారంగానే మిగిలింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి సిబ్బంది లేని, క్రయవిక్రయాలు లేని తూప్రాన్ వ్యవసాయ మర్కెట్ చైర్మన్ గిరి తెరపైకి వచ్చింది. నామినేటెడ్ పదవుల నియామకంలో భాగంగా ఇక్కడి పాలకవర్గంపై ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.



తూప్రాన్ వ్యవసాయ మార్కెట్ యార్డు

రేసులో నలుగురు..

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని జనరల్ మహిళకు రిజర్వు చేశారు. కాగా ఈ పీఠం దక్కించుకునేందుకు రేసులో నలుగురు ఉన్నారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వుమ్మన్నగారి భాస్కర్‌రెడ్డి సతీమణి మాజీ వైస్ ఎంపీపీ శరణ్యరెడ్డి, మనోహరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాళ్లకల్ గ్రామానికి చెందిన జూపల్లి మల్లారెడ్డి భార్య మాజీ సర్పంచ్ మంజుల, తూప్రాన్ మున్సిపల్ 6వ వార్డు కౌన్సిలర్ పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్త, కాగా బీసీ వర్గానికి చెందిన నాగులపల్లి సత్యనారాయణ భార్య సైతం పదవి ఆశిస్తున్నారు. ఈ దిశగా వారి భర్తలు ముమ్మర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

ఆశావహుల్లో ఉత్కంఠ

వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకంలో సీనియర్లను పక్కన పెడుతున్నారనే ప్రచారం జరుగుతుంది. తమకే ఆ పదవి కేటాయించాలని, సీనియర్లను పక్కన పెట్టడం సరికాదని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు నర్సారెడ్డి సైతం సానుకూలంగా స్పందించినట్లు వారు చెప్పుకుంటున్నారు. అయితే పదవికి అడ్డంకులు ఏర్పడితే జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. మార్కెట్ పీఠం ఎవరికి దక్కబోతుందనేది ఇంకా స్పష్టత రాలేదు.

పండుగలు భారతీయ సంస్కృతికి చిహ్నం

పెద్దశంకరంపేట(మెదక్): పండుగలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నమని జిల్లా ఆర్ఎస్ఎస్ శారీరక్ ప్రముఖ్ మనోజ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, పాఠశాల అధ్యక్షుడు దాదిగారి గంగాధర్, సర్వేశ్వర్, హెచ్ఎం వీరప్ప, జైహింద్‌రెడ్డి, సీతారామారావు, రవివర్మ, సతీష్‌గౌడ్, మధు, శైలేష్, శ్రీకాంత్ ఉన్నారు.



పెద్దశంకరంపేటలోని శిశు మందిర్‌లో రక్షాబంధన్ కార్యక్రమం

రామాయంపేటలో ఫొటోగ్రఫీ డే



జాక్విన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్స్

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్లు మొట్టమొదటి కెమెరా సృష్టికర్త జాక్విన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అవుట్ డోర్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షుడు మజీద్, కార్యదర్శులు సర్దార్‌నాయక్, యాదగిరి, సభ్యులు స్వామి, మల్లేశం, వినోద్, శివ, రాజ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

రామాయంపేట(మెదక్): కరెంట్ షాక్‌కు గురైన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రామాయంపేట మండలం ఝాన్సిలింగాపూర్‌కు చెందిన శాలిపేట లక్ష్మయ్య (55) ఐదు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి మరమ్మతు చేస్తుండగా, కరెంట్ షాక్‌తో కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. లక్ష్మయ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.



లక్ష్మయ్య (ఫైల్)

చెట్ల పొదల్లోనే తహసీల్దార్ జీపు



చెట్ల పొదల్లో ఉన్న తహసీల్దార్ జీపు



కూల్చిన కార్యాలయం దగ్గరే ఉన్న జనరేటర్

- 11 నెలల క్రితమే తరలిన కార్యాలయం
- నిరుపయోగంగా వాహనం, జనరేటర్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని కిషన్‌నగర్‌లో నిర్మించి ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లోకి 11నెలల కిందనే తరలించారు. పాత కార్యాలయ భవనాలను కూల్చి అక్కడ రైతు బజారు నిర్మిస్తున్నారు. కార్యాలయంలోని రికార్డులు ఫర్నిచర్ అంతా తరలించినా తహసీల్దార్ వినియోగించిన వాహనాన్ని మాత్రం అక్కడే వదిలివేశారు. జీపు రిపేర్‌కు రావడం, జీపు డ్రైవర్ రిటైర్డు కావడంతో అధికారులు దానిని మరమ్మతులు చేయించలేదు. తహసీల్దార్ తన సొంత వాహనంలోనే తిరుగడంతో గతంలో వినియోగించిన జీపు చెట్ల పొదల్లోనే వదిలేశారు. కార్యాలయ అవసరాల కోసం ఉపయోగించిన జనరేటర్‌ను కూడా అక్కడే వదిలేశారు.

సామూహిక జంధ్యా ధారణ మహోత్సవం



కాడిపల్లిలో సామూహిక జంధ్యా ధారణ చేస్తున్న పద్మశాలీలు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలో చేనేత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం జంజిరాల పౌర్ణమి సందర్భంగా సామూహిక జంధ్యా ధారణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పిస్కె నర్సింలు ఆధ్వర్యంలో స్థానిక పద్మశాలి సంఘం ఆలయ నిర్మాణ స్థలం వద్ద మార్కండేయ మహర్షికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సామూహిక (యజ్ఞోపవీతం) జంధ్యా ధారణ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తిరుమలేష్, దుర్గయ్య, జనార్దన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): పిడుగుపాటుతో పాడిఆవు మృతి చెందిన ఘటన మండలంలోని బస్వాపూర్ పరిధిలోని ముత్తన్నపేటలో చోటు చేసుకుంది. రైతు చెప్పిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కేడిక కిష్టారెడ్డి సోమవారం తన పాడిఆవును మేత కోసం పొలంవద్దకు తీసుకెళ్లారు. సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ ఆవు విలువ రూ.70వేలు ఉంటుందని, దానిపైనే ఆధారపడి జీవిస్తున్నానని వాపోయాడు. ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని కోరాడు.

వేలాడుతున్న విద్యుత్ తీగ

కొండపాక(గజ్వేల్): మండలంలోని దమ్మక్కపల్లి గ్రామంలో విద్యుత్ తీగలు భయపెడుతున్నాయి. ఓ ఇంటి వద్ద చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటిలోకి వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు విద్యుత్ తీగలు తాకుతున్నాయని వాపోతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్తు తీగలు సరిచేయాలిన కోరుతున్నారు.



వైర్లను చూపుతున్న గ్రామస్తుడు

బగలాముఖి మంత్ర దీక్ష

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం 50 మంది భక్తులు మంత్ర దీక్ష చేపట్టారు. వేద పండితుడు, బగలాముఖీ ఉపసాకులు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ భూ దాత పబ్బ రమేష్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీ మహేష్‌గుప్తా, అర్చకులు సంతోష్‌శర్మ, నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న పూజారులు

● ప్రకృతి ఒడి.. సర్కారు బడి

చిన్నకోడూరు మండలం రామునిపట్ల ఉన్నత పాఠశాల ఆవరణలో అడుగు పెడితే చాలు పచ్చదనం కనువిందు చేస్తుంది. పాఠశాల ఆవరణలో ఐదేళ్ల క్రితం 300మొక్కలు నాటారు. నాటిన మొక్కలను ఉపాధ్యాయులు, విద్యార్థులు రక్షించడంతో చెట్లుగా ఎదిగాయి. దీంతో పాఠశాల ఆవరణ మొత్తం ఇప్పుడు ఎటు చూసినా పచ్చదనంతో కళకళలాడుతూ హరితవనంగా కనిపిస్తోంది.

– చిన్నకోదూరు(సిద్దిపేట)



రామునిపట్ల పాఠశాలలో పచ్చదనం



కమ్ముకున్న కారుమబ్బులు

ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం. దట్టంగా కమ్ముకున్న కారు మబ్బులు. దృశ్యం సోమవారం మండలంలోని రంగంపేట గ్రామ శివారులో సాక్షి తన కెమెరాలో బంధించింది. – కొల్చారం(నర్సాపూర్)

సంక్షిప్త వార్తలు

◆ ప్రతీరైతుకు రుణమాఫీ చేయాలి

పాపన్న పేట (మెదక్): పట్టా పాస్ బుక్ ఉన్న ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హీరాలాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టా పాస్ బుక్ ఉన్న రైతులందరికీ రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రుణాలు తీసుకొని వారు వెంటనే బ్యాంకులకు వెళ్లి రుణాలు తీసుకోవాలన్నారు. ఇప్పుడేమో ప్రభుత్వ ఉద్యోగులకు రుణమాఫీ చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

◆ భారత్ బంద్‌కు తరలిరండి

చిన్నశంకరంపేట(మెదక్): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఈ నెల 21న భారత్ బంద్‌కు ఇచ్చిన పిలుపునకు మద్దతుగా నిలవాలని సోమవారం మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందరి శ్రీనివాస్, నార్సింగి మండల అధ్యక్షుడు చింతల మల్లేశం కోరారు. సుప్రీంకోర్టు తీర్పుతో అనేక మంది విద్యార్థులు, యువకులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ సంఘాలతో పాటు ఉద్యోగ, విద్యార్థి, మహిళలు మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అనిల్‌కుమార్, కరుణాకర్, వేణు ఉన్నారు.

◆ వర్షానికి కూలిన పెంకుటిల్లు



చిన్నశంకరంపేట(మెదక్): మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి శిథిలావస్థలో ఉన్న పెంకుటిల్లు కుప్పకూలింది. చిన్నశంకరంపేట మండలం మల్లుపల్లిలో సోమవారం గ్రామానికి చెందిన ధ్యాన బోయిన యాదమ్మ, సాయిలు నివాస గృహం ఒక్కసారిగా కుప్పకూలింది. ముందుగానే కుటుంబసభ్యులు గ్రహించి సామాన్లను తీసుకుని బయటికి వచ్చారు. ఆ వెంటనే కూలిపోయింది. దీంతో తృటిలో ప్రమాదం నుంచి కుటుంబసభ్యులు బయటపడ్డారు. కాగా నిత్యావసరాలు, దుస్తులు, ఆధార్, పట్టపాస్ పుస్తకం తదితర వస్తువులు లోపలే ఉండిపోయాయి. అధికారులు ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

◆ శ్రావణమాస పూజలు

కొల్చారం(నర్సాపూర్): శ్రావణ సోమవారం మండలంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని రంగంపేటలో గల సంగమేశ్వర ఆలయంలో శివలింగానికి అభిషేకం, పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



◆ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): బైక్‌ను కారు ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. శివ్వంపేటకు చెందిన పైనం నందు బైక్ పై గ్రామానికి వస్తుండగా సికింద్లాపూర్ గ్రామ శివారులో కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నందును స్థానికులు చికిత్స నిమిత్తం అసుపత్రికి తరలించారు.

◆ వివాహిత అదృశ్యం



మరియమ్మ

తూప్రాన్: వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంటకు చెందిన తుడుం కరుణాకర్ భార్య మరియమ్మ అలియాస్ పెంటమ్మ(32) ఈ నెల 5న తన పుట్టిల్లు తూప్రాన్ మండలం నర్సంపల్లికి వచ్చింది. 15వ తేది అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న భర్త కరుణాకర్ చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.